# ఇంతేనా? ★

శ్రీమతి చిట్టూరి అన్నపూర్ణా దేవి

నిత్యమల్లెపూలు కోసుకుంటున్న ఆశాలతనుచూచి కాలేజీకి తయారైన కిశోర్ అటు యిటూ చూచాడు. తల్లి వంటయింట్లో వంట చేసికొంటూంది. నెమ్మదిగా ఆశాలతను సమీపించి "ఆశా!" అన్నాడు. పూలు కోసుకుంటున్న ఆశాలత వెనక్కు తిరిగి "ఏం" అంది.

"ఆ పూలు నాకేనా?"

"కాదు"

"మరెవరికి?"

"శివుడికి"

"అయితే నాకేనన్నమాట మరి ఆ చలువరాతిమీద కూర్చోమంటావా?"

"అంత శ్రమ ఎందుకూ?"

"మరెందుకు. పూలమాలతో నా కంఠాన్ని అలంకరించటానికి"

"తమరంత కష్టపడకండి. తిన్నగా కాలేజీకి దయచేయండి" అంది ఆశాలత కొంటెగా.

"ఎలావేయవో నేనూ చూస్తాను" అని దారికడ్డంగా నిలబడ్డాడు.

"ఏం నీకింకా కాలేజీ సమయం కాలా?"

"అయింది"

"అయితే వెళ్ళవేం?"

"పూజ కానీ"

"ఇదిగో అత్తను పిలుస్తాను. ఆమె పూజకానిస్తుంది."

"నాకేం భయంలేదు కాని పూవులేవీ?" అంటూ లాక్కోబోయాడు. ఆమె చేయి వెనక్కు లాక్కుంది. మల్లె పందిరి తగిలి పూలన్నీ క్రిందపడిపోయాయి. ఆమె ఏడుపు ముఖంతో "నా పూలెందుకు పారవోశావ్?"

"మరి నా మెళ్ళో వేస్తానంటే ఎత్తి ఇస్తాను"

"ఎత్తితే మాత్రం ఒకసారి క్రిందపడిపోయిన పూలు పూజకు పనికివస్తాయా?" అంది కళ్ళనీళ్ళు నింపుకొని.

"అయితే నాకేం" అంటూ వెనక్కు తిరిగేటప్పటికి అక్కడే ఉన్న తల్లి కనిపించింది. తల్లినిచూచి ఏమీ ఎరగనట్లుగా ఊరుకొన్నాడు.

"కాలేజీకి టైమైతే ఇక్కడేంచేస్తున్నావురా? పూజకు కోసుకున్న పూలు ఎందుకు పారవోశావ్?"

ఇంతలో కిశోర్ నెమ్మదిగా అక్కణ్ణుంచి తప్పించుకు వెళ్ళిపోయాడు.

* * *

"బాబూ!"

"ఏవిటమ్మా?"

"ఆశ హిందీ పరీక్ష ప్యాసయిందట. ఇవి తెచ్చి ఇచ్చింది" అని ఒక ప్లేటులో జిలేబీలు, మైసూరుపాకం పెట్టి ఇచ్చింది.

"అయితే ఆశ ఏదీ?"

"మల్లెమొగ్గలు కోసుకుందామని వెళ్ళింది. అది వస్తూంది."

వస్తున్న ఆశనుచూచి "అయితే నువు ప్యాసైనందుకు పార్టీ ఇదేనా?"

"మహా తమరు ఇంటరుప్యాసై ఏమిచ్చేరో?" అంది దెప్పుతూ.

"డాక్టర్ని అయేంత వరకు ఏమీ యివ్వ తలచుకోలేదని చెప్పానుగా?"

* * *

కిశోర్ "ఎం. బి. బి. ఎస్." ప్యాసైనాడు. గవర్నమెంటు అతనిని స్పెషలైజు చేయటానికి విదేశాలకు పంపుటకు నిశ్చయించింది. ఆ విషయం తల్లితో చెప్పాడు. ఆమె ధైర్యంతో సరేనంది. కాని అభివృద్ధిలోకి వెళ్ళుతున్న కుమారుణ్ణి చూచి ఆనందించే భాగ్యం తన భర్తకు లేకపోయిందే అని విచారించింది.

కిశోర్ వెళ్ళే సమయం సమీపించింది. తల్లి ఎన్నో విషయాలు బోధించింది. అనంతరం పక్కింటి ఆశాలత తండ్రి చంద్రుగారికి చెప్పడానికి వెళ్ళాడు. చంద్రంగారు ఆశీర్వదించి సాగ నంపారు.

* * *

"అన్నయ్యా! యిచ్చిన మాట మరచి పోతున్నావు" అంది రుక్మిణమ్మ. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్న చంద్రం

"విషయమంతా తెలిసిన నీవే అలా అంటే ఎలా చెల్లెమ్మా?" "వాడు వస్తానన్న పైముకి రాకపోవటానికి ఏదో బలమైన కారణం ఉంటుంది." "అందుకేగా ఆరు మాసాలు ఎదురు చూచాను? కాని ఫలితం కనిపించలేదు" "కిశోర్ గుణం నీకు తెలియనిదికాదన్నయ్యా"

"ఈ కాలపు కుర్రాళ్ళ మాట కో నిజముంటూ లేదు. అందులోను మీఅబ్బాయి ఉన్నది పరదేశంలోను. గడుపుతున్నది స్వేచ్ఛాజీవితం. పోనీ అలాగే యింకా కొంత కాలం చూద్దామన్నా నా ఆరోగ్య పరిస్థితి నీకు తెలిసినదే తల్లి లేని పిల్లను. ఒక యింటిదానిని చేయకుండా నేను పోతే దాని గతేంకాను?"

"అయితే మన స్నేహము మరిచిపోయావా? ఆశాలత నీకెంతో నాకు అంతేనని నేననుకున్నట్లు నీవనుకోడంలేదా?"

"ఏ మనుకొన్నా నీ కొడుకు నీ మాట విననప్పుడు నీవేంచేయగలవు? నీ ఉద్దేశ్యం మార్చుకోవడం మంచిదమ్మా."

"అయితే ఆశ వప్పుకుంటుందా అన్నయ్యా?"

"ఆమెకు చిన్నతనం వప్పుకోకపోతే ఒప్పిస్తాను."

"అంతేనా అన్నయ్యా?"

"వేరు మార్గం లేదు చెల్లెమ్మా."

"సరే! వస్తానన్నయ్యా" అని రుక్మిణమ్మ వెళ్ళిపోయింది. యివన్నీ ఆలకిస్తున్న ఆశాలత హృదయం ప్రేమించిన అబ్బాయిని వదులుకోవటమా తండ్రిమాట కాదనటమా అనే సంధిగ్దములో పడ్డది.

* * *

"అమ్మా నేను ఊళ్ళోకి అడుగుపెట్టాను ఒక మేనా ఊరుబయట కనుపించింది. ఎవరో అమ్మాయి అత్త వారింటకి వెడుతుందనుకున్నాను. ఆమె ఎవరమ్మా"

తల్లి "ఆశాలత" అంది గంభీరంగా!

కిషోర్ ఆశ్చర్యంతో తల్లి ముఖం చూచాడు.

వీలుచిక్కక ఉత్తరాలు వ్రాయలేదని అతనికి పరిశోధనలో మరి తొమ్మిది మాసాలు పట్టినట్లు ఎవరికి తెలుసు?

* * *

"డాక్టరు గారున్నారా" అడిగాడు పోలీస్ ఆఫీసర్ ఉమాకాంతం.

ఆఫీసుబోయ్ "ఉన్నారుబాబూ" అన్నాడు.

"ఏంచేస్తున్నారు?"

"ఇప్పుడే హాస్పిటల్‌కు వెళ్ళటానికి సిద్ధ పడుతున్నారు"

కుర్రాడు పోలీసాఫీసర్ని గదిలోనికి తీసుకువెళ్ళి కుర్చీలో కూర్చో పెట్టాడు. డా॥ విరాగి పోలీసాఫీసరుని చూచి "నీవా ఉమాకాంత్" అన్నాడు. ఉమాకాంత్ కూడా "కిశోర్!" అని కౌగలించుకున్నాడు.

"అనుకోకుండా కలుసు కున్నాం" అన్నాడు డా॥ విరాగి.

ఉమాకాంత్ కిశోర్ చేయిపట్టుకొని ఈ పేరు మార్పేమిటి, అంతావైరాగ్యమేనా అన్నాడు.

"పేరు వింటే తెలియటంలే? చెప్పాలా సరే నాపేరు కేమొచ్చిందిలేగాని యిలాకూర్చో. నీవు పెళ్ళి చేసుకున్నావా? పిల్లలెంతమంది? ఎక్కడుంటున్నావ్? ఏం చేస్తున్నావ్?"అని ఒక్కసారి ప్రశ్నలవర్షం కురిపించాడు.

"పెండ్లి అయింది. సంతానంలేదు. కలగదు! యిక ఉద్యోగమా దుస్తులే చెపుతున్నాయ్. నివాసమూ ఈ ఊరే యిహ నీ విశేషాలు చెప్పు."

"చెప్తాగాని సంతానం కలగదని రూఢిగ చెప్పావు కారణం తెలుసుకో వచ్చా?"

"సరే అప్పుడే మొదలు పెట్టావే నీడాక్టర్ రిసెర్చి"?

"ఇంతకూ మీ ఆవిడ ఆరోగ్యం........."

"అదేనాకూ తెలీదు" వివాహమై మూడుసంవత్సరాలు అయింది ఆమె సర్వసేవలూ చేస్తుందికాని. ఒకరోజైన ఆమె చిరునవ్వును నేను చూడలేదు, ఎప్పుడూ ఏదో చేస్తూనో ఆలోచిస్తూనో ఉంటుంది. ఆమె గదిలోకిపొరపాటున ఎప్పుడైనా అడుగుపెట్టానా పెద్దపులిని చూచిన లేడివలె బెదరిపోతుంటుంది. నాకాళ్ళు వెనక్కులాగుతవి అంతే నేనిక అక్కడ నిలబడలేను వెళ్ళిపోతాను"

"ఆమె వంటరిగా ఎప్పుడైనా ఏడవడం గద్దా"

"ఆ....అదీచూచాను కొన్నిసార్లు" కారణం కూడా అడిగాను కాని ఏమీలేదని జవాబిచ్చింది.

"కేసు విచిత్రంగా ఉందే!"

"అందుకే నీపేరువిని ఇలావచ్చేను అందులోనూ మిత్రుడవే అయ్యావు ఇక నాజీవితంలో ఆనందం పొడ చూపగలదని ఆశిస్తూ ఉన్నాను"

"భగవంతుడిదయ ఉంటే అలాగే"

"మరి నీవిశేషాలేవీ చెప్పలేదే నీఫామిలీ ఎక్కడ?"

"ఎక్కడాలేదు"

"ఐతే యింకా పెళ్ళిచేసుకోలేదూ ?"

"ఏం?"

"నీవు చేసుకొని ఏం ఆనందిస్తున్నావ్?"

"అదీ నిజమే" అంటూండగా ఆఫీస్‌బోయ్ కాఫీ ఫలహారము తీసుకవచ్చి టేబిలుపై ఉంచాడు,

"ఇదంతా దేనికి ఉమా"

"తినడానికి గాని, ప్రారంభించు." ఇద్దరూ ఫలహారం చేయటం ముగించారు.

ఉమాకాంత్ కిశోర్‌ని వెంట తీసికొని యింటికి వెళ్ళాడు. స్నేహితులిద్దరూ కూర్చున్నారు, ఉమాకాంత్ భార్యను కాఫీ తెమ్మని కబురు పెట్టాడు. పది నిముషాల్లో ఆమె రెండు కాఫీ కప్పులతో వచ్చి టేబిలుమీద పెట్టి వెళ్ళబోయింది. వెళ్ళిపోతున్న భార్యను పిలిచి "ఇతడు నా బాల్య స్నేహితుడు. ఇద్దరం కలిసి చదివాం" అని పరిచయంచేశాడు ఆమె "నమస్కారం" అంది. అతను కూడా తల పైకెత్తి నమస్కారమని అలానే ఉండి పోయాడు. అతన్ని చూచిన ఆమె కూడా నిర్జీవంగా నిలబడిపోయింది. ఇంతలో బయటనుండి ఉమాకాంత్ గార్ని సూపరెండెంటుగారు అర్జంటుగా రమ్మని కబురు చేశారు ఉమాకాంత్ "ఇప్పుడే వస్తాను కూర్చో"మని బయలుదేరాడు డా॥ విరాగి కొంతసేపటికి తెప్పరిల్లి నిలబడ్డాడు. బొంగురుపోయిన కంఠంతో అన్నాడు "ఆశా ఆనందంగా ఉండు. నా స్నేహితుని ఆనందమే నా ఆనందము. నే వస్తాను." అని నెమ్మదిగా అడుగులు వేసికొని ఇల్లు దాటి విశాల ప్రపంచంలో విలీనమైనాడు. ఆమె హృదయం "ఇంతేనా!" అని మూలిగింది.

